క్లుప్తంగా

బాల్య వివాహాలతో జీవితాలు బుగ్గి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐ మస్తాన్

గుంతకల్లుటౌన్: బాల్య వివాహాలతో ఆడపిల్లల జీవితాలు బుగ్గిపాలవుతాయని, బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని టూటౌన్ సీఐ మస్తాన్ సూచించారు. శనివారం పాతగుత్తిరోడ్‌లోని సమాఖ్య కార్యాలంయలో చైల్డ్‌లైన్ 1098 ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. సీఐతో పాటు జిల్లా బాలల పరిరక్షణ సమితి అధికారిణి వెంకటేశ్వరి మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో పిల్లలకు సాంకేతిక పరిజ్ఞానం అవసరమన్నారు. అయితే ఇంటర్నెట్‌లో పిల్లలు ఎలాంటి వెబ్‌సైట్స్‌ను ఎక్కువగా సంప్రదిస్తున్నారో గమనించి, వారు చెడుదారిలో వెళ్లకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. కార్యక్రమంలో హ్యాండ్స్ సంస్థ కోఆర్డినేటర్ నాగలక్ష్మి, వీఓ సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

శనీశ్వరుడికి తైలాభిషేకం


అలంకరణలో శనీశ్వరుడు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని తాడిపత్రి రహదారి పక్కన వెలసిన శనీశ్వరుడి ఆలయంలో శనివారం శని త్రయోదశి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో ప్రధాన అర్చకుడు బాబా స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కుంకుమాభిషేకం, అర్చనలు, తైలాభిషేకం, పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

కిశోర బాలికల సంక్షేమమే లక్ష్యం


మాట్లాడుతున్న సీడీపీఓ సాజిదాబేగం

తాడిపత్రి రూరల్: కిశోర బాలికల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని సీడీపీఓ సాజిదాబేగం సూచించారు. పట్టణంలోని సంజీవనగర్‌లోని ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం ప్రాజెక్టులోని సూపర్‌వైజర్లతో సమావేశమయ్యారు. 11 నుంచి 18సంవత్సరాల్లోపు కిశోర్ బాలికలకు విద్య, ఉపాధి, రక్షణ పట్ల అవగాహన కల్పించాలని ఆమె వివరించారు. బాల్య వివాహాలు అరికట్టాలన్నారు. కిశోర బాలికలు స్వయంసమృద్ధి సాధించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ప్రతి మంగళ, శుక్రవారం కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం ప్రీ స్కూల్ అసెస్‌మెంట్‌పై సమీక్ష చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే మూడు సంవత్సరాల వయస్సు చిన్నారులు గ్రోత్‌పై దృష్టి పెట్టాలన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

యాడికి: రేషన్ కార్డు లబ్ధిదారులు ఈ నెల 30లోపు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో 2,196 మంది ఈ-కేవైసీ పెండింగ్ ఉందన్నారు. వీరు తప్పకుండా డీలర్ల వద్ద ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. లేకుంటే వీరికి వచ్చే నెల నుంచి రేషన్ సరుకులు నిలిపివేస్తామన్నారు.

మోదీని విమర్శించే స్థాయి షర్మిలకు లేదు


మాట్లాడుతున్న బీజేపీ నాయకురాలు విజయలక్ష్మి

గుంతకల్లుటౌన్: ప్రధాని నరేంద్ర మోదీని విమర్శించే స్థాయి ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు లేదని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ మండిపడ్డారు. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి మోదీసర్కారు భద్రతా వైఫల్యమే కారణమంటూ విమర్శలు చేసిన షర్మిలపై బీజేపీ నేతలు నిప్పులు చెరిగారు. శనివారం స్థానిక ఇల్లూరు లక్ష్మీనారాయణ భవన్‌లో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పహల్గామ్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా భారత్ చేపట్టబోయే ప్రతీకార చర్యల నేపథ్యంలో మోదీపై షర్మిల నిందలు వేయడాన్ని వారు తప్పుబట్టారు. ఉగ్రవాదుల వ్యవహారంలో సంయమనంతో మాట్లాడాల్సింది పోయి ఇష్టానుసారంగా మాట్లాడితే దేశద్రోహిగా పరిగణించాల్సి వస్తుందన్నారు. మోదీ గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవాలని లేకపోతే తగిన బుద్ధిచెబుతామని వారు హెచ్చరించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు వాసం రవి, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఎం.కేశవ, సీనియర్ నాయకులు గుర్రం సూర్యనారాయణ, నారాయణ రెడ్డిలు పాల్గొన్నారు.

చీనీ రైతుకు ధరాఘాతం

- మార్కెట్‌లో చీనీ ధరల **పతనం**
- తెగుళ్లతో ఎండుతున్న **చెట్లు**
- ఆందోళనతో రైతులు


చీనీకాయలను విక్రయానికి సిద్ధం చేస్తున్న దృశ్యం


ముకుందాపురంలో సాగు చేసిన చీనీతోట

గార్లదిన్నె: చీనీ రైతులను ధరాఘాతం వేధిస్తోంది. ధరలు భారీగా తగ్గడంతో చీనీ పంట సాగు కష్టతరంగా మారిందని రైతులు వాపోతున్నారు. శింగనమల నియోజకవర్గం చీనీ కాయలకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. అలాంటి చీనీ కాయల సాగు చేసే రైతుల పరిస్థితి నేడు దయనీయంగా మారిపోయింది. **అలాగే** మూడు సంవత్సరాలు **నుంచి** తెగుళ్ల కారణంగా చీనీ చెట్లు **ఎండిపోతు**న్నాయి. మరోవైపు చీనీ చెట్లు **కాపాడుకో**వడానికి అధికంగా పెట్టుబడి **పెట్టి ఆ మేరకు** దిగుబడులు రాకపోవడంతో **రైతులు తీవ్రంగా నష్ట**పోతున్నారు.ముఖ్యంగా నియోజకవర్గంలో గార్లదిన్నె మండలంలో గార్లదిన్నె, ముకుందాపురం,యర్రగుంట్ల, తిమ్మంపేట, బూదేడు, పెనకచెర్ల,పెనకచెర్ల డ్యాం, కమలాపురం ,మర్తాడు, కోటంక గ్రామాల్లో వేల ఎకరాల్లో చీనీ పంట సాగులో ఉంది. అలాగే శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల మండలాల్లో సైతం చీనీ సాగు విస్తారంగా ఉంది.

పెరగని చీనీ ధరలు

ప్రస్తుత కోత దశలో ఉన్న చీనీ కాయలకు ధరలు ఏమాత్రం పెరగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది మార్చి, ఏప్రిల్ టన్ను కాయలు రూ.40 వేల నుంచి 50 వేల వరకూ పలికాయి. ప్రస్తుతం టన్ను రూ.20 వేల నుంచి 25 వేలు మాత్రమే ఉంది. దీనికి తోడు ఈ ఏడాది **మా**ర్కెట్‌లో ధరలు తగ్గడంతో వ్యాపారులు **ధర**లు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. అలాగే **మూ**డు సంవత్సరాలు నుంచి చీనీ చెట్లకు తెగుళ్ల **వ్యాపిం**చడంతో వాటి నివారణ కోసం వేల రూపా**య**లు ఖర్చు పెట్టినా ప్రయోజనం లేక పోతోందని **రైతు**లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా **వేరు** కుళ్లు కారణంగా చెట్లు నిలువునా ఎండిపో**తున్నా**యి. అలాగే చీనీ కాయలకు నల్లి ఆశించడం**తో కా**యలు (మంగు) నల్లగా మారిపోతున్నాయి.

తోటల తొలగింపు

నష్టాలు వస్తుండడంతో రైతులు చీనీ తోటలను తొలగించి ప్రత్యామ్నాయ పంటలు సాగు వైపు ముగ్గు చూపుతున్నారు. గార్లదిన్నె మండలంలో చీనీ పంటకు ప్రసిద్ధి. అలాంటిది సాగు భారం కావడంతో చాలా మంది రైతులు చీనీ చెట్లు తొలగించి, అరటి, మొక్కజొన్న తదితర ప్రత్యామ్నయ పంటల సాగుకు ఉపక్రమించారు. కొత్తగా చీనీ తోటలు ఏర్పాటుకు రైతులు ఏమాత్రం ఆసక్తి చూపడం లేదు. గతంలో రైతులే చీనీ మొక్కల నర్సరీల సైతం ఏర్పాటు చేసి ఇతర ప్రాంతాలకు సరఫరా చేసేవారు. ప్రస్తుతం నర్సరీలు సైతం కనుమరగయ్యాయి.

ప్రభుత్వం నుంచి ఆదరణ కరువు

ప్రభుత్వం నుంచి చీనీ సాగుకు ఆదరణ కరువైందని రైతులు వాపోతున్నారు. గతంలో పాత తోటల పునరుద్ధరణ పథకం కింద రైతులకు ప్రోత్సాహం ఉండేది. ప్రస్తుతం వాటికి ప్రభుత్వం మంగళం పాడడంతో పాటు చీనీ చెట్లు ఎండిపోతున్నా వాటికి ఇన్సూరెన్స్ రావడం లేదు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

తీవ్రంగా నష్టపోతున్నాం..



ఆరుగాలం శ్రమించి పంట దిగుబడులు వచ్చే సమయంలో ధరలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం.ప్రభుత్వమే కనీస మద్దతు ధరగా టన్ను చీనీ కాయలు రూ.40 వేలతో కొనుగోలు చేయాలి. ప్రస్తుతం కూలీలు, పురుగుమందులు, ఎరువుల ధరలు భారీగా పెరిగాయి. కాయలకు మాత్రం ధరలు పెరగకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. – కొల్లాకర్, చీనీ రైతు పెనకచెర్ల

రాయితీతో ఎరువులు అందజేయాలి



ప్రస్తుతం చీనీ సాగు కష్టంగా మారింది. వాతావరణంలో మార్పులు కారణంగా తెగుళ్లు ఒక తోట నుంచి మరో తోటకు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి.లెక్కలేనన్ని సార్లు పురుగు మందులు పిచికారీ చేసినప్పటికీ ప్రయోజనం కనిపించలేదు. ప్రభుత్వమే రాయితీతో నాణ్యమైన పురుగు మందులు సరఫరా చేయాలి. – చెన్నారెడ్డి, రైతు సంఘం నాయకులు

తెగుళ్లపై అవగాహన కల్పిస్తున్నాం



తక్కువగా ఉన్న విషయం వాస్తవమే. మహారాష్ట్రలో దిగుబడి పెరగడంతో ధరలు తగ్గినట్లు తెలుస్తోంది. తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. అలాగే గ్రామాల్లో చీనీ పంటల తెగుళ్లపై అన్నదాతకు అవగాహన సదస్సులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.
– రత్నకుమార్, ఉద్యాన శాఖ అధికారి

మద్దతు ధరతో వరి కొనుగోలు


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

గార్లదిన్నె: ప్రభుత్వం కనీస మద్దతు ధరతో వరి ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు మండల వ్యవసా య అధికారి సోమశేఖర్ తెలిపారు. శనివారం మండలంలోని మర్తాడులో వ్యవసాయ అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలంలో రైతులు రబీలో 2,200 ఎకరాల్లో వరి పంట సాగు చేశారన్నారు. ఇప్పటికే 700 ఎకరాల్లో వరి పంట కోత జరిగిందన్నారు. ఇంకా 1,500 ఎకరాల వరి పంట కోత దశలో ఉందన్నారు. జంబులదిన్నె సొసైటీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ప్రభుత్వం క్వింటాల్ వరి రూ.2,300 ధరతో కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు ధాన్యంలో తేమ శాతం 17 కంటే తక్కువ ఉండేవిధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రంగనాథస్వామి ఊరేగింపు



తాడిపత్రి రూరల్: పట్టణంలో శనివారం రాత్రి రంగనాథస్వామి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. రెడ్డివారిపాలెంలో ఉన్న కోదండ రామస్వామి దేవాలయంలో భూదేవి, శ్రీదేవి సమేత రంగనాథస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పట్టణంలోని రెడ్డివారిపాలెం, పుట్లూరు రోడ్డు, యల్లనూరు రోడ్డు మీదుగా శ్రీ రంగనాథస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు.

రేపటి నుంచి ఆలయ ప్రారంభోత్సవం

పామిడి: మండలంలోని అనుంపల్లిలో ఈనెల 28, 29, 30 తేదీల్లో ఆంజనేయస్వామి నూతన ఆలయ ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు శనివారం గ్రామస్తులు తెలిపారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని ఆంజనేయస్వామి అనుగ్రహం పొందాలని వారు కోరారు.

మాస శివరాత్రి పూజలు


అలంకరణలో భోగేశ్వరుడు

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో శనివారం మాస శివరాత్రి విశేష పూజలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్ భోగేశ్వరుడు, ప్రసన్న పార్వతి మాతను శోభాయానంగా అలంకరించారు. ప్రధాన అర్చకుడు దేవగుడి రామేశ్వరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు చంద్రాశర్మ, అనిల్‌కుమార్ దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేకార్చనలు గావించారు.

గ్రామాల్లో చిచ్చు పెట్టడం సరికాదు


ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, వెంకటరెడ్డి జెడ్పీటీసీ భాస్కర్

బుక్కరాయసముద్రం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నాయకులు గ్రామాల్లో కక్షలు రేగేలా చిచ్చు పెట్టడం ఏమాత్రం సరికాదని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు వెంకటరెడ్డి అన్నారు. చెన్నంపల్లిలో టీడీపీ నాయకుడు మల్లికార్జునరెడ్డి ఆక్రమణలపై శనివారం మండల కేంద్రంలోని కార్యాలయాల్లో ఎంపీడీఓ సాల్మాన్ రాజు, తహసీల్దార్ పుణ్యవతికి జెడ్పీటీసీ భాస్కర్‌తో కలసి వారు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెన్నంపల్లిలో టీడీపీ నాయకుడు మల్లికార్జునరెడ్డి పబ్లిక్ మరుగు దొడ్లకు పట్టాలు చేయించుకుని అమ్ముకున్నాడన్నారు. రోడ్డును ఆక్రమించుకుని అమ్ముకున్నారన్నారు. మల్లికార్జునరెడ్డి అనుచరులు జగనన్న కాలనీకి వెళ్లే దారిని ఆక్రమించి షెడ్లు వేసుకున్నారని, వీటిపై ఇదివరకే ఫిర్యాదు చేశామన్నారు. గ్రామ కంఠం స్థలాలను ఆక్రమించుకున్నారన్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని ప్రజా ప్రతినిధుల అండతో మల్లికార్జున రెడ్డి అక్రమాలకు పాల్పడుతున్నాడన్నారు. టీడీపీ కార్యకర్తలను రెచ్చగొడుతూ ఘర్షణలకు పాల్పడేలా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా కక్షలు రేపుతున్నాడన్నారు. మల్లికార్జునరెడ్డి ఆక్రమణలపై ఆయన దౌర్జాన్యాలపై కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, ప్రసాద్, లక్ష్మిరెడ్డి, వెంకటరామిరెడ్డి, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి

పెద్దవడుగూరు: ఫ్యాక్షన్ గ్రామాల్లోని ప్రజలు గొడవలను వదిలి శాంతియుతంగా జీవించాలని తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి సూచించారు. శనివారం మండలంలోని అప్పేచర్లలో ఆయన పర్యటించారు. అనంతరం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్షన్ గొడవల వలన కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు రావాలన్నా కష్టమవుతుందన్నారు. అనంతరం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గొడవలు జరిగితే ఉపేక్షించేది లేదన్నారు. కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. అనంతరం బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో సీఐ రామసుబ్బయ్య, ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్ర దాడులకు నిరసనగా ముస్లింల ర్యాలీ


గుత్తిలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న ముస్లింలు


తాడిపత్రిలో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లిం జేఏసీ నాయకులు

గుత్తి/తాడిపత్రి రూరల్/గుంతకల్లుటౌన్: జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో హిందూ పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రవాదులు కాల్పులు జరిపి 28 మందిని పొట్టన పెట్టుకున్న ఘటనను ఖండిస్తూ గుత్తిలో శనివారం ముస్లిమ్ మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది ముస్లింలు ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద నుంచి గాంధీ సర్కిల్ వరకూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉగ్రవాదులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం పహల్గాం మృతులకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ముస్లిమ్ మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ నాయకులు, సభ్యులు, ముస్లింలు పాల్గొన్నారు. అలాగే తాడిపత్రి పట్టణంలో శనివారం రాత్రి ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి గాంధీ సర్కిల్‌లో మానవహారంగా నిలిచి ఉగ్రవాదాలకు వ్యతిరేకంగా నివాదాలు చేశారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు ఫయాజ్‌బాషా, హయాజ్‌బాషా, అరిఫ్, ముస్లింలు అయూబ్, జిలాన్, జాకీర్, రియాజ్, షబ్బీర్, షెక్షా తదితరులు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లులో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ శనివారం రాత్రి 'పాస్బనే అహలే సున్నత్ అసోసియేషన్' ఆధ్వర్యంలో ముస్లింలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. రైల్వేస్టేషన్ రోడ్‌లోని జామియా మసీదు నుండి మదీనా ఆర్చ్ వరకూ ర్యాలీ జరిగింది. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ నివాళులర్పించారు. పట్టణ ముస్లిల ప్రభుత్వ ఖాజీ సయ్యద్ రజాక్‌పీర్‌సాబ్, అదనపు ఖాజీ సత్తార్ సాబ్, మతపెద్దలు, మతగురువులు, మసీదు కమిటీల ప్రతినిధులు, ముస్లింలు పాల్గొన్నారు.



గుంతకల్లులో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న ముస్లింలు

వ్యక్తి ఆత్మహత్య

- మృతుడు అనంతపురం వాసి


ఆనంద్ (ఫైల్)

గుంతకల్లుటౌన్: పట్టణంలోని రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న పాడుబడిన రైల్వేక్వార్టర్స్‌లో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపిన వివరాలు.. అనంతపురంలోని కమలానగర్‌కు చెందిన దేవిరెడ్డి ఆనంద్(54) అనంతపురంలో లామినేషన్ సెంటర్ నిర్వహించేవాడు. మద్యానికి బానిసైన అతడు తరుచూ భార్య, కుమారుడితో గొడవపడేవాడు. ఈక్రమంలో భార్య తన కుమారుడితో కలిసి స్వస్థలమైన రాయదుర్గం వెళ్లిపోయింది. రెండు నెలల నుంచి తన ఇంటికి వెళ్లకుండా గుంతకల్లు, కర్నూల్ రైల్వేస్టేషన్లల్లో కాలం వెళ్లదీస్తున్న ఆనంద్ శనివారం ఉదయం పాడుబడిన రైల్వేక్వార్టర్స్‌లో నైలాన్ తాడుతో ఉరేసుకున్నాడు. మృతుడి జేబులో ఉన్న ఫోన్ నంబర్ల ఆధారంగా అతని కుటుంబ సభ్యులకు సమాచారాన్ని చేరవేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

పందుల కాపరిపై దాడి

పామిడి: పామిడిలోని పందుల కాపరి నరసింహపై దాడి ఘటనలో కేసు నమోదు చేసినట్లు శనివారం రాత్రి పోలీసులు తెలిపారు. స్థానిక మార్కెట్‌కు చెందిన దొంగ శివ అండ్‌కో దాడి చేసినట్టు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

టెన్త్ టాపర్‌కు సన్మానం


విద్యార్థి నరసింహను సన్మానిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

గుత్తి: గుత్తి మోడల్ స్కూల్ విద్యార్థి నరసింహా పదో తరగతి ఫలితాల్లో 600 మార్కులకుగాను 593 మార్కులు సాధించాడు. జిల్లాలోనే ప్రభుత్వ పాఠశాలల్లో టాపర్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా నరసింహను కలెక్టర్ వినోద్‌కుమార్ సన్మానించారు. అనంతపురంలోని కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో నరసింహతో పాటు అతని తల్లి కళావతి, తాత జయరాముడును కూడా సత్కరించారు. భవిష్యత్‌లో మరింతగా కష్టపడి బాగా చదవాలని విద్యార్థికి కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో గుత్తి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉషా, నాగేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి తాగునీటి సరఫరాలో అంతరాయం

గుంతకల్లుటౌన్: స్థానిక గుంతబావి ఏరియా నుంచి మండీబజార్ వాటర్ ట్యాంక్ వరకూ మెయిన్ పంపింగ్ పైప్‌లైన్ ఏర్పాటు పనులు జరుగుతున్నందు వల్ల ఈ నెల 28 నుంచి మే 2 వరకూ పట్టణంలోని 1,2,3,15,16,17,18,19,22,23, 29,30,36,37 వార్డులకు నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ పేర్కొన్నారు. తదుపరి ప్రకటనను జారీ చేసే వరకూ నీటిని పొదుపుగా వాడుకోవాలని శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

28 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

గార్లదిన్నె: స్థానిక గ్రంథాలయంలో సోమవారం నుంచి విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారిణి శిరీష తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఈనెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తామన్నారు. విజ్ఞాన శిబిరాల్లో కథలు వినుట, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, చిత్ర లేఖనం, పేపర్ ఆర్ట్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని అనంతపురం రోడ్డులో శనివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. గార్లదిన్నెకు చెందిన రాము, ఓబులేసు బైక్‌లో గుత్తికి వచ్చారు. తిరిగి వెళ్తున్న సమయంలో రోడ్డుకు అడ్డంగా కుక్క వచ్చింది. దీంతో బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన రాము, ఓబులేసును స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం రూ. 90 లక్షలు వెచ్చించి 16 బోర్లు వేయించామన్నారు. ఇందులో ఆరు చోట్ల నీళ్ల పడలేదన్నారు. మిగతా 10 ప్రాంతాల్లో బోర్లలో సమృద్ధిగా నీళ్లు పడ్డాయన్నారు. బోర్లకు పైప్‌లైన్‌లు ఏర్పాటు చేసి ఇంటింటికీ తాగు నీరు సరఫరా చేయిస్తామన్నారు. అలాగే తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో ఎనిమిది ట్యాంకర్లతో నీరు సరఫరా చేయిస్తున్నామన్నారు. ఎక్కడైనా నీటి సమస్య తలెత్తితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. అవసరమైతే వాటర్ ట్యాంకర్ల సంఖ్యను పెంచుతామన్నారు.

టెక్నికల్ సర్వేయర్ లైసెన్సుకు దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లుటౌన్: పట్టణంలో ఐటీఐ-సివిల్, బీటెక్-సివిల్, బీ-ఆర్క్, బీప్లానింగ్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు టెక్నికల్ సర్వేయర్, స్ట్రక్చరల్ ఇంజినీర్‌గా లైసెన్సులు పొందడానికి దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ నయీమ్ అహ్మద్ తెలిపారు. మున్సిపల్ ఆఫీసు టౌన్‌ప్లానింగ్ విభాగం లేదా ఓబీపీఎస్ -ఏపీ డీపీఎంఎస్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న మహేష్

గుంతకల్లు రూరల్: హమాలీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని హమాలీ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక బీటీ పక్కీరప్ప భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 44 లక్షల మంది హమాలీలు ఉండగా.. వారి సమస్యలు పరిష్కరించడం మాట అటుంచితే కనీసం తెలుసుకున్న పాపాన కూడా పోవడం లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం హమాలీలందరినీ ఒకతాటిపైకి తీసుకువచ్చే క్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటలకు బీరప్ప గుడి ఫంక్షన్ హాల్‌లో పెద్ద ఎత్తున సదస్సును ఏర్పాటు చేశామన్నారు. హమాలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడంతోపాటు, పరిష్కార మార్గాలపై దృష్టి సారిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సదస్సుకు హాజరుకావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.